# గౌరీగంగాంబలు

శ్రీ రాయసం వెంకటశివుడుగారు

ముప్పదియైదేండ్లు దాటి, మొగమందు మడతలు దోఁచి, ముంగురుల నిగనిగలు తొలఁగిపోవుచున్నను, సంతానప్రాప్తి లేకుండుటకంటె హిందూ సతికి మనస్సంతాపకరమగు విషయము మఱియొకటి లేదు! ఐనను గౌరాంబ యెపుడును ధైర్యవతియే. ఆయంగన కెవ్విధమగు లోపమును లేదు. విద్యా విభవములు, సౌందర్య సౌజన్యములు, అన్నిటి కంటె పతియనురాగమును,—ఆయువిద సొమ్మే. ఐన నిటీవల నీ సుందరి మనసొకింత కలఁకఁ బాఱియున్నది. తనకుఁ బిల్లలు లేరని యెన్నఁడు తలపోయలేదు. కాని, కొంతకాలమునుండి మనస్సున నీ తలంపు చొచ్చి, ఆమె సౌఖ్యమునకు మనశ్శాంతికిని కొంత విఘ్నము గలిగించుచున్నది. సంతానములేని సంసార మసారమని యిపుడీమె నమ్మకము. ఇట్లు తలపోయుట స్త్రీకి స్వాభావికమె యని సిద్ధాంతము చేసికొన్నది కూడను. పతియు నిట్లె తలంచుచున్నాఁడా యని యిపు డాలోచింపఁ దొడంగెను. సామాన్యముగ బురుషులు యాలోచనలు వృత్తి వ్యాపారములందును, కార్యకలాపమందును లగ్నమగుచుండును గాని, పిల్లల దెసకుఁ బరుగు లిడవని యామె నిర్ధారణ చేసికొనెను. ఐనను, ఏండ్లు పైఁబడినకొలఁదిని మాధవరావు మనస్సుమగూడ నీ విషయమె తలంచుచున్నదా యని గౌరాంబ యపుడపుడు సందియ మందుచుండును. ఇంతేకాక, కొండ్రత్రవ్వి యెలుకను బట్టినట్లు, శ్రమపడి భర్తమనస్సును బరీక్షించి ఆయనకును సంతానాపేక్ష కొంత గలదని తెలిసికొనిన నొరిగిన దేమి? ఒకవేళ, అతనికిని, ఈ కోరిక యున్నదని తేలినచో, ఆమె ముందలి ప్రణాళిక యేమి? ఐన నీ సంగతి కొంత త్రవ్వి చూతమని గౌరాంబ యంత నిశ్చయించుకొనెను.

౨

నేఁ డొక సెలవుదినము. పుస్తకాగారమున పడకకుర్చీలోఁ గూర్చుండి, మాధవరావు వార్తాపత్రిక చూచుకొనుచుండెను. గౌరాంబ తేనీటి జాడియు, గిన్నెలు మిల్లి గరిటెలును జేతఁ బట్టుకొని, ఆ గదిలోఁ బ్రవేశించి, చిన్నబల్లమీఁద నాటినుంచి, తేనీరు గలుపఁ జొచ్చెను.

అంత మాధవరా విట్లనెను:—"చూచావా గౌరాంబా! ఈ పటమందలి పిల్లలమోము లెంత ముద్దులు గులుకుచున్నవో?"

ఈమాటలు గౌరాంబ వినియు విననటులుండెను! కారణమేమి? ఇన్నాళ్లును ప్రేమ యుట్టిపడునట్లు 'పిల్లా' యనియు, 'గౌరా' యనియును చనవున సంబోధించెడి పతి యేలొకో యపుడు పిలుపులోఁ దనను మన్నించుచున్నాఁడని యా సుదతి సందియము! అనుమానపడువారి కనుమానములె తోఁచుచుండును. 'గౌరాంబా' యను పిలుపు, నాథునికిఁ దనమీఁది వలపు తగ్గుమొగము నున్నట్లు సూచించుటలేదా? అందులకుఁ గారణము? సతి సంతానవతి గాకుండుట గాక వేరేమి?

ఇది రూఢిపఱచుకొనుటకె యా తరుణియిపుడు పతి చెంత కేగి, "ఏమండీ మీరు చూడుచున్న పిల్లల బొమ్మలు?" అని యడిగెను. భర్త చూపిన చిత్రమును బరీక్షించి, అందలి యొక శిశువు తనకు ముద్దు వచ్చుచున్నదని సతి పలుకఁగా, ఎదిగినపిల్లవాఁ డొకఁడు తనకు నచ్చెనని పతి చెప్పెను.

"ఎంత వైభవముంటే యేమున్నది? పిల్లలు లేని యిల్లొక యిల్లా?" అని గౌరాంబ దైన్యమునఁ బలుకుటయె సంతానవిషయమై యా దంపతులు తొలిసారి ప్రస్తావించుకొనుటకుఁ గారణము. తేనీరు గ్రోలుచు వా రంత కొనసాగించిన సంభాషణ మిట్లు ముగిసెను.

౩

మాధరావు: ఎప్పుడును లేని సంపదకొరకు

సంతాపపడడము, ఉన్నదాని ననుభవింపలేకపోవడానికే. మనకు పిల్లలు కలుగడమె యీశ్వరసంకల్పమైతే, సర్వసమర్థుడైన ఆయనే ప్రసాదించియుండును గదా!

గౌరాంబ: దేవుడిచ్చ్యలేదని చేతులు ముడుచుకొని కూర్చుండవలసినదేనా?

మాధవ: లేకుంటే, పూర్వకాలంలోవలె పుత్రకామేష్టి చేదామా? యెరువుల పిల్లలను మేపడానికి పరువులు పెడదామా?

గౌర: ఈ రెండు అక్కరలేదేమో సుమండీ!

మాధ: లేకపోతే, యీ యాభయ్యోపడిలో సంతాన నెపముమీద మళ్లీ నన్ను పెళ్లిపీట లెక్కించి, సవతిని తెచ్చిపెట్టుకొని, చిత్తశాంతి పోగొట్టకుంటావా, చెప్పు?

గౌర: దైవం మీ నోటనే శుభం పలికిస్తున్నాడు! మీరు వేళాకోళం చేస్తే చెప్పలేను గాని కాలదోషం పట్టిన నా మీద యింక ఆశ పెట్టుకోక, సంతానం కోసం రెండో పెళ్లి మీ రేల చేసుకోరాదని నే నడుగుతున్నాను? మగనికి గలిగే సంతానముహిమలో భార్యకుకూడ పాలు వుంటుంది గదా?

మాధ: నా కివన్నీ తెలియవు. ఊరికే వున్న వానికి సంతానమునే నెపంమీద రెండో పెళ్లి తెచ్చిపెట్టుతున్నావు గనుక నీవే చక్కని పెళ్లికూతురును సమకూర్చి తేవలెను సుమీ! ఏం?

తేనీటి సమయమందలి యీ దంపతుల సంభాషణమంతట నవ్వులతోను పరియాచకములతోను ముగిసెను. ఈ విషయము మాత్రము ముగియలేదు!

౮

అన్యోన్య సౌహార్దమున మెలంగెడి యీ గృహమందలి యీ స్త్రీ లిరువురును తల్లికూతులా అక్క చెలెల్యండ్రా? పోలికలు లేక, వయోవ్యత్యాసమున నొప్పెడి వీరు మనసు గలిసిన సఖులా, దూరపుబంధువులా? వీరిలో గృహయజమానురా లెవరు? పెద్దవారు మన కిదివఱకే దెలిసిన గౌరాంబయే, గంగాంబ పేరుతో నుండు చిన్నది, యామె సవతి. ఇపుడు తెలిసినవి! వెనుక సంభాషణలో దంపతులు నవ్వుచు ననుకొనిన మాటలె యిపుడు క్రియారూపము దాల్చినవి! గౌరాంబ కృషివలననే యామె పతికి గంగాంబ రెండవభార్య యగుటచేత, ఆ యిరువురు పత్నులును పరస్పరప్రేమతో మనుచున్నారు—సవతుల సామర్థ్యము, పిల్లి యెలుకల పొత్తువలెను, అగ్ని జలముల పొందికవలెను, స్వభావ విరుద్ధముగ నుండునని జను లనుకొనుచుందురు—దీని నసత్య మనిపించుటకు ధాత యీ యిరువురు స్త్రీలను సృజించినట్లున్నది! తనకు బూర్వపరిచితియు, తన పెండ్లికి మూలకారణమును నగు గౌరాంబను గంగమాంబ సవతి యని భావింపక అక్క యని పిలుచును. కావుననె, అక్కచెల్లెండ్రవలె మెలంగు పత్నులుగల మాధవరావు గృహకల్లోలము లెఱుంగక, శాంతచిత్తమున కాలము గడుపుచున్నాఁడు.

౯

వయో విద్యాదులందుఁ దనకంటె బెద్దదియగు గౌరాంబ యింటఁ బెత్తనము చెల్లించుట గంగాంబ కభిమతమె. భక్తి కృతజ్ఞతలు గలిగి, గౌరాంబ యెడల వినయవిధేయతతో మెలంగు గంగాంబకు తోడికోడలు నిజమైన అక్కయె గదా. ఇంక నీ యువతిపట్ల నే కోశమందు నీర్ష్యయు మత్సరమును లేక, అవ్యాజప్రేమమునఁ జెలంగు గౌరాంబ కీమె చెల్లెలగుటయం దాశ్చర్యమేమి? గౌరాంబ కార్యనిర్వహణభారము పెద్దదగు తానె నిర్వహించుచు, ఆమె లేఁతవయస్సునకుఁ దగిన తేలికపనులు చెల్లెలికొప్పగించుచుండును. ఇంతియు కాదు — పిల్లలులేని తాను చిన్న సవతినిఁ దనపిల్లవలెఁ జూచుకొను కొనుచుండెను. భర్త తమ యిరువురకును సమానాదరము చూపించుట, గౌరాంబ కెంత మాత్రము

నసూయాజనకముగాక, మఱింత ముదావహముగ నుండెను — కావుననే, ఆ గృహమం దెప్పుడును సౌఖ్యసంపదలు శుక్లపక్షచంద్రికలువలె నభివృద్ధి నొందుచుండునని లోకు లనుకొనుచుండిరి.

౬

ఈర్ష్యాళు స్వభావములుగల జనుల గుణప్రదర్శనమునకీ లోకము రంగస్థలము సుజనులు సుగుణములను, దుర్జనులు దుర్గుణములను ఈ ప్రపంచసీమను నిరతము వెదజల్లుచుందురు. ఇంటఁ బను లంతగ లేక పొరుగిండ్లకుఁ బెత్తనములు సాగించుట పరిపాటి యయిన యమ్మలక్కలు కొందఱికి సవతులుండు నీ యింట కలఁతలు లేకుండుట గొప్ప కొఱంతగఁ దోచెను! గృహమం దొకింత క్షోభయున్నఁ గాని శోభ యుండదని వీరి మతము! ఇట్టి సద్వనితలు కొందఱు మాధవరావుగారి యింటికి మెల్లగ రాకపోకలు సలుపుచు, సమయము గనుగొను నెపమున గౌరీ గంగాంబల యీలలు తీయుచు, వారి కొకరియెడల నొకరి కనుమానములు పుట్టించిరి! తాము వీరల రహస్యము గాపాడుదుమని నమ్మించి, యీమె సంగతు లామెకును, ఆమె సంగతు లీమెకును, తమ కల్పనలతోఁ బొడిగించి చెప్పుచు, సవతుల కొకరియెడ నొకరికి వైరము గలిగించిరి — దీని పర్యవసాన మేమన, వయసు పైఁబడుచున్న గౌరాంబకనులకు, యౌవనప్రాయమందుండు తన సవతిమీఁద భర్తకు మోహమతిశయించుచున్నట్లు తోఁచెను. దీనికిఁ దోడుగా మొన్న మొన్న కాపురమునకు వచ్చిన సవతికపుడె కూఁతురు గలిగనే! తల్లిప్రేమను మరపించునంతటి మోహమునఁ దానా శిశువును జూచుకొనుచున్నను, ఎందుచేతనో, ఇటీవల గంగాంబ తనపుత్రికను సవతి దరి చేరనీయకున్నదే! ఇంక గంగాంబ హృదయమునఁ గూడ సందియములు తాండవించెను. "ఎంత మంచిదైనను సవతి సవతియె గదా! నీ బాలికనుగుఱించి యెపుడు గాని యేమరియుండేవు! సుమీ" అని అమ్మ పెద్దమ్మను గుఱించి పెదవి విడిచి, చిన్నమ్మను హెచ్చరించుచుందురు! దీనికి నిదర్శనముగా, ఇటీవల నేమి కారణముచేతనో గాని, గౌరాంబ జూచి మొగము ముడుచుకొనుచున్నదే? ఇట్టి గుఱుతులు కనిపెట్టియె, గంగాంబ యొకానొక దినమునఁ దన మనస్సులో నిట్లనుకొనెను: "ఎక్కడి అక్కలు, ఎక్కడి చెల్లెళ్లు? స్వాభావికంగా వుండాలిగాని, పూసుకొని తిరిగితేను, వరసలు పెట్టుకొని పిలుచుకొంటేను, ప్రేమ పుట్టుకొనివస్తుందా? ఇంకా నయము, పెందరాళ్లే మేలుకొన్నాను! లేకపోతే, యీ పాటికీ కపటురాలు యే మిషో పన్ని నా పిల్లను కబళించే వేసును!" అక్కచెల్లెండ్రు వలె మెలఁగిన యా సవతు లిట్లు ఈర్ష్యచేతను, ఇతరుల కుతంత్రములవల్లను నానాటి నొకరి యెడల నొకరపోహలు గలిగియుండిరి!

౭

కావుననే, మాధవరావు, తా నిదివఱ కెంత యదృష్టవంతుఁడ ననుకొనెనో, ఇపుడంత దురదృష్టవంతుఁడ నని వగచెను! అతనికిఁ బూర్తిగ మనశ్శాంతి తొలఁగిపోయెను. "ఇంటిలోని పోరింతింతగా"దని యతఁడు గ్రహించెను. ఒకరిపొడ యొకరికిఁ గిట్టని వట్టి పెడసరికట్టెలు భార్యలుగఁ బ్రాప్తించి తనను వేధించుచున్నారని యతఁడు మొఱలిడెను. అతని గృహమున రెండు వేరింటి కాపురములు బయలుదేరెను! ఇంతియకాదు — సతులకు సఖ్యము నొడఁగూర్చి, యిద్దఱికి నిష్టుఁడుగ నుండఁగోరు తానే యుభయులకును మఱింత ద్వేష్యుఁడగుటకు మాధవరా వాశ్చర్యమందెను! ఏండ్లు వచ్చిన తాను, ఆలిమాటలకుఁ జెవియొగ్గి రెండవపెండ్లి కేల సిద్ధపడితినా యని యతఁడు వెతనందెను.

౮

ఈ జగన్నాటకరంగమున వేవేగముగ తెరలు

మాఱుచుండును. మానవుఁడు తాను సర్వజ్ఞుఁడ నని భావించి పెద్దపెద్ద ప్రణాళిక లేర్పఱచుకొనఁగా, కాలాధినాథుఁడు వానికి వ్యాఘాతములఁ గల్పించుచుండును! మాధవరావుగా రింట నిటీవల చనిపోయిన వా రెవరు? యౌవనవతి గంగాంబ! ఎదురుచూడని యొక విషరోగమునకు లోనై, వెంటనే యకాలమృత్యువువాతఁబడి, మూన్నాళ్ల ముచ్చటయై పోవు నని యెవ రనుకొనిరి? సవతిపట్ల సఖ్యము లేని గౌరాంబ, అంతట పరిస్థితుల వైపరీత్యమువలన నామెపిల్లకుఁ బెంపుడుతల్లి యయ్యెను! మన మనుభవించు కష్టములె కనులువిప్పి, మనలను సన్మార్గమునకు మరలింపఁజాలియుండును. అష్టకష్టములు పడి శిశువును సాఁకవలసివచ్చిన గౌరాంబకు, జననిని గోలుపోయిన యా బాలికను జూచునప్పుడెల్ల దుఃఖముతోఁ గడుపు చుమ్మలు చుట్టుకొనిపోవుచుండును! భర్త దుఃఖమునకు, సవతిచావునకు, ఆదురదృష్టవతిమీఁద నకారణ వైరమూనిన తన నీచబుద్ధికిని, గౌరాంబ మిక్కిలి వగచెను!

౯

ఉదంతము లింతటితో నంత మొందలేదు. ఎన్నఁడును కనిపెంచుట లెఱుఁగని గౌరాంబ కిపుడు, అనురాగమున నొకపిల్లను బెంచుట నూతనానుభవమై, ఆమె తత్త్వమున నూతన పరిణామము గలిగించెను. నలువదియేండ్లు దాటిన యీ సుదతికి చూలు వచ్చుట చుట్టుప్రక్కల స్త్రీ లాశ్చర్యమునం జెప్పుకొనిరి. ఏ విపత్తును లేక దబ్బపండువంటి పిల్లవానినిఁ గనిన గౌరాంబ యదృష్టము నందఱు మెచ్చుకొనిరి. ఇప్పుడింటఁ బెరుఁగు నిద్దఱు పిల్లలను గౌరాంబ సమాన ప్రేమతోఁ జూచుటయె కాదు; ఈడేరని కోరికలతో బాల్యమరణ మందిన సవతిబిడ్డ మీఁదనె యామె "ఒకవాసి యెక్కువశ్రద్ధఁ జూపుచుండు"నని కనిపెట్టిన కాంతలందఱు ననుకొనుచున్నారు! ఆ మానిని తన సుగుణములను బెంపొందించుకొనుచు, పరిస్థితులకు మార్పులకుఁ దొట్రుపడని సమత్వబుద్ధి నలవఱచుకొనినది కావుననే, ఆమె పతి మనశ్శాంతితో మనుటయు, పిల్లలు సత్ప్రవర్తనతో నలరారుటయు, వారి గృహమును సకలసంపదల కాకరమగుటయు సంభవించెను.

# సముద్రతీరము

ఏలనీ సంద్రమిట్టుల నెగసియెగసి
రొదలు సేయుచున్నదో! హృదయమందు
యేమహాజ్వాల రగిలెనో యేమొ! మిగుల
నుడుకుచున్నది క్షణమైన నూరటిలదు.

విసువును విరామమును లేక విస్మృతముగ
నలల నిలపైకి విసరును అలుపు లేదు,
యేమి యాశయమున్నదో యెవ్వ డెరుగు!
ఆయగాధంపు జలనిధి హృదయమునను.

సంతతపరితప్తమౌ నాదు స్వాంతమునకు
సంతతక్షోభనందు యీసంద్రమునకు
నెల్లవిధముల పోలికల్ గలిగియుంట
నాయె నీసాగరతటంబె నాకాశ్రయంబు

హృదయమున దాగియుండిన యగ్గికొండ
పగిలినప్పుడు యీమహాసాగరంపు
రొదలలోపల నాదగు హృదయఘోష
యణగిపోవును అదియ నాకగు ప్రశాంతి.